SAKSHI 16 JAN 2021

# తీరానికి పోటెత్తిన పర్యాటకులు



రాజీవ్ రివర్‌బీచ్ వద్ద పర్యాటకుల సందడి

యానాం: సంక్రాంతి నేపథ్యంలో శుక్రవారం యానాం పట్టణం పర్యాటకులతో కిక్కిరిపోయింది. ఇతర రాష్ట్రాల నుంచి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన పర్యాటకులతో గౌతమీగోదావరి తీరం రాజీవ్‌రివర్ బీచ్ కిటకిటలాడింది. అధికసంఖ్యలో వాహనాలతో పర్యాటకులు తరలిరావడంతో పార్కింగ్ స్థలాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. ముఖ్యంగా రాజీవ్‌రివర్‌బీచ్‌లో శివమ్‌బాత్ వద్ద స్నానాలతో పర్యాటకులు ఆహ్లాదాన్ని పొందారు. అదేవిధంగా జీసెస్ స్టాట్యూ, రాజీవ్‌పార్క్ తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. గోదావరిలో పర్యాటకులు బోటుషికారు చేశారు. రాజీవ్ రివర్ బీచ్ నుంచి జీసెస్ స్టాట్యూవరకు జనసంద్రాన్ని తలపించింది. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం ఎప్పటికప్పుడు జాగ్రత్తలను మైక్ ద్వారా వివరించారు. అదేవిధంగా బొటానికల్ గార్డెన్‌లో సైతం లేజర్‌షోకు జనాలు క్యూకట్టారు. గిరియాంపేటలోని ఓబ్లిస్కిటవర్, వివిధ పార్క్‌ల్లో పర్యాటకులు సందడి చేశారు.

**ముగ్గుల పోటీలు**

కనుమ రోజున శుక్రవారం సీతమ్మ పేటలో యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లులు పోటీల్లో మహిళలు పాల్గొన్నారు. మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులు అందరినీ అలరించాయి. మహిళలకు వివిధ ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. యువజనసంఘ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# ఓబ్లిస్కిటవర్ సందర్శన



ఓబ్లిస్కిటవర్‌ను సందర్శించిన ఏపీ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యానాం: నియోజకవర్గ పరిధిలోని గిరియాంపేటలో ఓబ్లిస్కిటవర్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా యానాం, ఆంధ్రప్రదేశ్ కు చెందిన అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన పారిస్‌లోని ఈఫిల్ టవర్ నమూనాలో నిర్మించిన యానాం ఓబ్లిస్కిటవర్‌ను సందర్శించి పైన ఉన్న భాగానికి వెళ్లి అక్కడ నుంచి సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలించారు. అదేవిధంగా తాళ్లరేవు మండల విద్యాశాఖ తరపున ఉపాధ్యాయులు సీఎస్ఆర్ కృష్ణమూర్తి, సాయిప్రసాద్, సీఆర్‌పీలు రాజేంద్ర, మీరాసాహెబ్‌లు మంత్రి ఆదిమూలపు సురేష్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. నీలపల్లిలోని మండలపరిషత్ ఆదర్శప్రాథమిక పాఠశాల మనబడి–నాడునేడు డాక్యుమెంటేషన్ పుస్తకాన్ని మంత్రి సురేష్‌కు అందజేశారు. మంత్రి సురేష్ రాకతో విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ అధికారి రామ్‌మోహన్, ఎస్సై బడుగు కనకారావు పాల్గొన్నారు.

## 'కోవిడ్' వ్యాక్సినేషన్‌కు ఏర్పాట్లు పూర్తి

యానాం: యానాంలో కోవిడ్–19 వ్యాక్సిన్ 'కోవిషీల్డ్' వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఏఓ శివరాజ్‌మీనా శుక్రవారం తెలిపారు. ఇప్పటికే వచ్చిన 320 డోసుల వ్యాక్సిన్‌లో తొలి వందటీకాలను కేంద్రం నిబంధనలకు ప్రకారం వైద్యులు, హెల్త్‌వర్కర్లకు వేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ వేయడానికి స్థానిక సెంట్రల్ బోయ్స్ స్కూల్(సీబీఎస్ఈ)లో కావాల్సిన ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఇందుకోసం ఇంజక్షన్ ద్వారా టీకాను తీసుకున్న వారిని అబ్జర్వేషన్ గదుల్లో కొద్దిసేపు ఉంచుతామని తెలిపారు.

ANDHRA JYOTHI 16 JAN 2021

## యానాం బీచ్‌లో పర్యాటకుల సందడి

యానాం, జనవరి 15: యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌లో సంక్రాంతి సందర్భంగా పర్యాటకులు. సందడి చేశారు. టూరిజం శాఖ ఏర్పాటుచేసిన బోటింగ్ ద్వారా వృద్ధగౌతమి గోదావరినదిలో షికారు చేస్తూ ఎంతో ఆహ్లాదకరంగా గడిపారు. ఎస్పీ భక్తవత్సలన్, సీఐ గూటం శివగణేష్ ఆదేశాలతో ఎస్ఐలు కట్టా సుబ్బరాజు, కనకారావు, అల్ఫాన్స్‌రాజ్‌లు బందోబస్తు నిర్వహించారు.

యానాం: యానాంలో శనివారం నుంచి కొవిడ్ వ్యాక్సిన్ అందిస్తామని యానాం పరిపాలనాధికారి శివరాజ్‌మీనా తెలిపారు. తొలిదశలో ఆరోగ్య శాఖ సిబ్బందికి వ్యాక్సిన్ అందిస్తామన్నారు.

ANDHRA JYOTHI 16 JAN 2021

# సంబరాల సంక్రాంతి



యానాం బీచ్‌లో సెల్ఫీ తీసుకుంటూ...

16 JAN 2021 PRAJA SAKTHI

## వ్యాక్సినేషన్ కోసం ఏర్పాట్లు సిద్ధం

ప్రజాశక్తి - యానాం

మొదటి విడత కరోనా వ్యాక్సినేషన్ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు యానాం డిప్యూటీ కలెక్టర్ శివరాజ్ మీనా తెలిపారు. ఇంజక్షన్, అబ్జర్వేషన్ గదులు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యశాఖలో పనిచేసే వైద్యులు, నర్సులు, లాబ్ టెక్నీషియన్లకు తొలి 100 టీకాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారాల నిర్వహణ, ఉపాధి కోసం అధిక శాతం యానాం జనాభా సమీప పట్టణాలైన కాకినాడ, అమలాపురం, రాజమండ్రికి నిత్యం రాకపోకలు సాగించేవారు. ఈ కారణంగా 70 వేల మంది జనాభా ఉన్న యానాంలో డిసెంబర్ నెలాఖరు నాటికి 2,100 మంది కరోనా బారినపడ్డారు. తాజాగా నూతన సంవత్సర వేడుకలు, వివాహ కార్యక్రమంలో పాల్గొన్న 13 మందికి వైరస్ సోకినట్లు గుర్తించిన అధికారులు అప్రమత్తమయ్యారు. వీరందరికీ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సనందిస్తున్నారు. ఇప్పటివరకు అక్కడ 40 వేల మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా, 2,060 మంది కోలుకున్నట్లు ఆరోగ్యశాఖాధికారి కాశీ సత్యనారాయణ తెలిపారు. 45 మంది ఇతర అనారోగ్య సమస్యలతో మరణించినట్లు పేర్కొన్నారు.